నేటి కాలం

RNI.No.APTEL/2023/90038

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 264 | ఎడిటర్ : గనగల్ల రామారావు | విజయనగరం, బుధవారం 11 నవంబర్ 2026 | వెల : 2 రూ/ | పేజీలు : 4

నేటి కాలం
తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా, మండలాల వారీగా
విలేఖరిగా పనిచేయడానికి అనుభవం కలిగిన
లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు
సంప్రదించండి
సెల్ : 95813 47358

భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్

ఆమోదముద్ర

సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ -కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ (ూఒ+జ-శ=) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ – ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది.



అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉఫాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

సింధును చూసి

ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది

సింధుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

రెండుసార్లు ఒలింపిక్ పతక విజేతగా ఒక తరానికి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంస

కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్ష



ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు."రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది" అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి

ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి

2028 డిసెంబర్ 31 నాటికి డ్రగ్స్ రహిత గుజరాత్ లక్ష్యమన్న అమిత్ షా
దేశవ్యాప్తంగా 2029 నాటికి డ్రగ్ ఫ్రీ ఇండియా సాధన
డ్రగ్స్ సమాచారం కోసం డిసెంబర్ 1 నుంచి హెల్ప్‌లైన్ 1033
అహ్మదాబాద్‌లో రూ.1,400 కోట్ల పనులను ప్రారంభించిన అమిత్ షా

2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత (డ్రగ్ ఫ్రీ) రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు.

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు.

డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధితులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు



సంజయ్ సస్పెన్షన్‌ను మరోసారి

పొడిగించిన ఏపీ ప్రభుత్వం

-రిటైర్మెంట్ తేదీ 2027 మార్చి 31 వరకు లేదా విచారణ పూర్తయ్యే వరకు వేటు కొనసాగింపు

-ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ అయిన 2027 మార్చి 31 వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ ముగిసే వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం అధికారిక జీవో విడుదల చేసింది.గతంలో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో 'అగ్ని' వెబ్ పోర్టల్ నిర్వహణలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సంజయ్‌పై వచ్చాయి. అంతేకాకుండా, ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1.15 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ అభియోగాల నేపథ్యంలో, ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1969లోని రూల్ 3(1) ప్రకారం ప్రభుత్వం 2024 డిసెంబర్ 3న సంజయ్‌ను తొలిసారి సస్పెండ్ చేసింది. అనంతరం 2024 డిసెంబర్ 24న ఏసీబీ ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. మరోవైపు, సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. విచారణలు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు ఆయన సస్పెన్షన్‌ను సర్వీస్ ముగిసే వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది





పొత్తు ధర్మం.... జరిగేనా రవ్వాకు

- నెల్లిమర్ల నగర పంచాయతి వైస్ చైర్మన్ రేసులో రవ్వా
- జనసేనకు వైస్ చైర్మన్ పదవి?

న్యాయం..!







నేటి కాలం – నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతి వైస్ చైర్మన్ పదవి కోసం ఇప్పుడు పెద్ద రేసు నడుస్తోంది. పొత్తులో భాగంగా వైస్ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ సమీకరణాల దృష్ట్యా రవ్వా కుటుంబం ఇప్పుడు కీలకంగా మారింది.ఆది నుండి జనసేనను బలోపేతం చేసిన రవ్వా నాని

జనసేన పార్టీ పుట్టినప్పటి నుండి నెల్లిమర్లలో జనసేనను బలోపేతం చేసిన నాయకుడు రవ్వా నాని. పార్టీకి కష్టకాలంలో కూడా అండగా నిలిచి, జనసేన జెండాను నెల్లిమర్లలో ఎగరేసిన నాయకుడు ఆయన.

ప్రస్తుతం నెల్లిమర్ల నగర టౌన్ జనసేన అధ్యక్షుడిగా సేవలందిస్తున్న రవ్వా నాని, నెల్లిమర్లలో జనసేనకు వెన్నెముకగా నిలిచారు. పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, కార్యకర్తలను కాపాడుకోవడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం.

వార్డు మెంబర్ గా గెలిచిన రవ్వా నాని సోదరి!

నెల్లిమర్ల నగర పంచాయతి ఎన్నికల్లో రవ్వా నాని సోదరి అమూల్యరాణి వార్డు మెంబర్ గా పోటీ చేసి ఘన విజయం సాధించారు. ప్రజల ఆదరాభిమానాలతో, రవ్వా కుటుంబంపై ఉన్న నమ్మకంతో ఆమె గెలిచారు.ఇప్పుడు ఆమె వైస్ చైర్మన్ పదవి కోసం ఆశగా చూస్తున్నారు. జనసేనకు వైస్ చైర్మన్ పదవి వస్తే, ఆ పదవికి అర్హురాలు రవ్వా నాని సోదరే అని జనసేన శ్రేణులు గట్టిగా చెబుతున్నాయి.

చైర్మన్ పదవి బీజేపీకి... గెలిచింది టీడీపీ రెబెల్!

పొత్తులో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతి చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించినప్పటికీ, టీడీపీ రెబెల్ అభ్యర్థి లెంక అప్పలనాయుడు గెలుపొందారు. దీంతో చైర్మన్ పీఠం కూటమి చేతుల్లో నుండి జారిపోయి రెబెల్ చేతిలోకి వెళ్లింది.ఇప్పుడు వైస్ చైర్మన్ పదవి మాత్రం కూటమి ధర్మం ప్రకారం జనసేనకు దక్కాలని జనసేన నేతలు పట్టు పడుతున్నారు. చైర్మన్ పదవి పోయినా, వైస్ చైర్మన్ పదవి అయినా జనసేనకు ఇచ్చి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వైస్ చైర్మన్ పదవి మాత్రం రవ్వా ఆశపడుతున్నారు!

వైస్ చైర్మన్ పదవి కోసం రవ్వా నాని సోదరి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆమెకు ఆ పదవి ఇస్తే, నెల్లిమర్లలో జనసేన మరింత బలోపేతం అవుతుందని, కూటమికి మంచి జరుగుతుందని జనసేన కార్యకర్తలు అంటున్నారు.

రవ్వా కుటుంబం త్యాగం, కష్టం, పార్టీ పట్ల నిబద్ధత దృష్ట్యా వైస్ చైర్మన్ పదవి వారికే దక్కాలని జనసేన శ్రేణులు ఏకగ్రీవంగా కోరుతున్నాయి.

ఏం జరుగుతుంది?

జనసేన అధిష్టానం, కూటమి పెద్దలు వైస్ చైర్మన్ పదవిపై ఏ నిర్ణయం తీసుకుంటారు? రవ్వా కుటుంబానికి న్యాయం జరుగుతుందా? లేక మరో సమీకరణం తెరపైకి వస్తుందా? అనేది ఇప్పుడు నెల్లిమర్లలో హాట్ టాపిక్.నెల్లిమర్ల రాజకీయాల్లో రవ్వా పేరు ఇప్పుడు మారుమోగుతోంది





ఆల్తీ జన్మదినం...

సేవా సంబురం



- ఘనంగా సీనియర్ టీడీపీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు 58వ జన్మదిన వేడుకలు

- సేవా కార్యక్రమాలతో ఆల్తీపుట్టినరోజు



నేటి కాలం – నెల్లిమర్ల: సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, జైత్ర కన్స్ట్రక్షన్స్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు 58వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేవలం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం కాదు, ఈ పుట్టినరోజును సామాజిక సేవతో ముడిపెట్టి ఆదర్శంగా నిలిచారు శ్రీనివాసరావు.

ముందుగా శివాలయంలో 108 కొబ్బరికాయలు!

కొండపేట శీనన్న సైన్యం మొక్కు మేరకు, శీనన్న యువసేన ఆధ్వర్యంలో కొండపేటలోని శివాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివుని ఆశీస్సులతో, గ్రామ ప్రజల ప్రేమతో జన్మదిన వేడుకలు మొదలయ్యాయి. ఆలయ ప్రాంగణం మొత్తం శీనన్న అభిమానులతో, యువతతో కిక్కిరిసిపోయింది. “జై శీనన్న... జై జై శీనన్న” నినాదాలతో కొండపేట మారుమోగిపోయింది.

గ్రామ ప్రజల సమక్షంలో కేక్ కట్!

అనంతరం గ్రామ ప్రజల సమక్షంలో ఆల్తి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి, మూడో వార్డు కౌన్సిలర్ ఆల్తి పద్మ, నాలుగో వార్డు కౌన్సిలర్ నడిపేన నారాయణరావు, సీనియర్ టీడీపీ నాయకులు మజ్జి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ - చిన్నారుల్లో ఆనందం!

జన్మదిన వేడుకల్లో అత్యంత ఆకట్టుకున్నది విద్యార్థులకు చేసిన సేవ. ఎన్.జే.పీ. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు, ఎరేజర్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వు చూసి శ్రీనివాసరావు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. “చదువే మన భవిష్యత్తు, చదువుకున్న పిల్లలే రేపటి నాయకులు” అని ఆయన పిల్లలకు సందేశం ఇచ్చారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆధ్వర్యంలో కుసుమంచి



వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వృద్ధులతో కొంత సమయం గడుపుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. చలికాలంలో వృద్ధులకు దుప్పట్లు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున యువత, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మాట్లాడుతూ...

ఈ సందర్భంగా ఆల్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.”కొండపేట గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులో పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తాను. గ్రామంలో ఎవరికైనా ఎలాంటి కష్టం వచ్చినా, ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.”

అని స్పష్టం చేశారు.

గ్రామస్తుల హర్షం!

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా విద్యార్థులకు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు, యువత హర్షం వ్యక్తం చేశారు.“శీనన్న అంటేనే సేవ, శీనన్న అంటేనే అండ” అని గ్రామస్తులు కొనియాడారు. కొండపేటలో శ్రీనివాసరావు చేస్తున్న సేవా కార్యక్రమాలు మిగతా నాయకులకు ఆదర్శం అని యువత అభిప్రాయపడింది. ఆల్తి శ్రీనివాసరావు 58వ జన్మదిన వేడుకలు



లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలి

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్

నేటి కాలం – విజయనగరం: జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో డిసెంబరు 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నవంబరు 10న ఆదేశించారు.జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – డిసెంబరు 12న జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలతో ఎక్కువ కేసులు పరిష్కారం (రాజీ) అయ్యే విధంగా సంబంధిత పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీసు స్టేషను పరిధిలో నమోదైన కేసుల్లో ఇరు వర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్, రోడ్డు ప్రమాద కేసులు ఇతర కాంపౌండు కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలతో సంప్రదించి, సమావేశాలు నిర్వహించి, వారు రాజీ అయ్యే విధంగా మానవతా దృక్పదంతో వ్యవహరించాలన్నారు. ఇందుకుగాను పోలీసు స్టేషను స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రోజూ లోక్ అదాలత్లో పరిష్కారమయ్యే కేసులను సంబంధిత అధికారులను పర్యవేక్షించాలని, లోక్ అదాలత్ విజయ వంతం అయ్యేందు అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. కేసుల్లోని ఇరు వర్గాలపై ఒత్తిడి లేకుండా, సహకారాత్మక వాతావరణంలో రాజీ అయ్యేలా వారిని ప్రోత్సహించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తే కేసులు త్వరగా, సానుకూలంగా రాజీ అయ్యే అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎక్కువ కేసులు లోక్ అదాలత్లో



పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టడం వలన న్యాయ వ్యవస్థపై భారం తగ్గి, బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు.లోక్ అదాలత్ లో పరిష్కారమయ్యే కేసులను ప్రతీ రోజూ ఆయా సబ్ డివిజన్లుకు చెందిన డిఎస్పీలు, సిఐలు పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అధికారులను ఆదేశించారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు బి.శాంతి, జిల్లా వ్యవసాయ శాఖ జె.డి. రామారావు



నేటి కాలం – విజయనగరం: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి. శాంతి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ రామారావు సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి కలక్టరేటు ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం రెండవ సెషన్‌లో వారు మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని శిక్షకులకు దిశ నిర్దేశం చేశారు.

గత ఏడాది కంటే అధిక దిగుబడి అంచనా.. 4 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి. శాంతి మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో సుమారు 4.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందులో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధరను పెంచిందని, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,441/- గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.2,461/- చొప్పున ప్రకటించినట్లు వివరించారు. రైతులు తమ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో కూడా విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు.

వ్యవసాయ శాఖతో అనుసంధానంగా కొనుగోలు ప్రక్రియ

ధాన్యం సేకరణ మొత్తం వ్యవసాయ శాఖతో అనుసంధానమై ఉంటుందని, పంట నమోదు, రైతుల ఈ-కేవైసీ, ఫార్మర్ ఐడీల సృష్టి వంటి ప్రక్రియలు పూర్తయిన తరువాతే ధాన్యం సేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఆర్ఎస్‌కే నుంచి మిల్లుల వరకు రవాణా ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. వాహనాల ప్రయాణ వివరాల్లో పొరపాట్లు ఉంటే జీరో ట్రిప్స్, అనవసరమైన ఫిర్యాదులు, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ముందుగానే రైతు సేవా కేంద్రాల (=ూఖ) రిజిస్ట్రేషన్, అవసరమైన పరికరాలు, వాహనాలు, హమాలీలు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. మొబైల్ యాప్, ప్యాడీ ప్రొక్యూర్మెంట్ పోర్టల్ ద్వారా షెడ్యూలింగ్, శాంపిల్స్ సేకరణ, నాణ్యత పరీక్షలు తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు.

రైతు ఐడీ తప్పనిసరి.. పెండింగ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రభుత్వానికి ధాన్యం విక్రయించే ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన 20 అంకెల ఫార్మర్ ఐడీని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు, వ్యవసాయ సహాయకులు పెండింగ్‌లో ఉన్న రైతుల జాబితాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించి, ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండలాల వారీగా ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాల రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 100 వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మిగిలిన వాహనాల వివరాలను కూడా త్వరితగతిన నమోదు చేయాలని తెలిపారు.

పంట కోత ప్రయోగాలు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో పంట కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో క్రాప్ కటింగ్ ఎక్స్‌పెరిమెంట్స్‌కు సంబంధించి ఫారం-1 ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఫారం-1 ప్రక్రియ సుమారు 30 శాతం మాత్రమే పూర్తయిందని, రాబోయే రెండు రోజుల్లో 100 శాతం ప్లాట్ సెలెక్షన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తదుపరి ఫారం-2 ప్రక్రియను కూడా నిర్దేశిత విధంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజాం డివిజన్‌లో ఇప్పటికే పంట కోతలు ప్రారంభమయ్యాయని, మరో 15 రోజుల్లో ధాన్యం సేకరణకు అనువైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. విజయనగరం, కొత్తవలస తదితర ప్రాంతాల్లో పంట కోతలు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని, డిసెంబర్ మొదటి వారం నుంచి ఆయా ప్రాంతాల్లో కూడా ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.

నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రభుత్వం నిర్దేశించిన ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఖీూూ) ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరగాలని అధికారులు సూచించారు. ధాన్యంలో తేమ శాతం, తాలు, చెత్త, రాళ్లు తదితర నాణ్యత ప్రమాణాలపై రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని సిద్ధం చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే మిల్లుల వద్ద తిరస్కరణలు, ఇతర సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో ఒక బృందంగా పనిచేయాలని సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రతి దశలోనూ పారదర్శకత, ఖచ్చితత్వం పాటిస్తూ రైతులకు సకాలంలో సేవలు అందించాలని కోరారు.

ధాన్యం సేకరణపై జరిగిన రెండవ సెషన్ జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టరు అరుణకుమారి, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు బి. శాంతి, జిల్లా పారసరఫరాల అధికారి జి.మురళీనాథ్, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జులు, మండల వ్యవసాయ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనవరి 25 నుంచి రెండోదశ జనగణన

- శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

నేటి కాలం – విజయనగరం:

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 16వ జన గణన-2027 ప్రక్రియ రెండోదశను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తిగా సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. చింతలవలసలోని ఎం.వి.జి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా, ఛార్జ్ లెవెల్ అధికారులకు జరుగుతున్న రెండోదశ జనగణన శిక్షణా కార్యక్రమంలో రెండో రోజు మంగళవారం కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శిక్షణ తీరును కలెక్టర్ పరిశీలించి, అధికారుల అవగాహనా స్థాయిని పరీక్షించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ మూడు రోజుల శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకొని డేటా సేకరణపై పూర్తి స్పష్టత, అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి తప్పిదాలు, సమన్వయ లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక్కో గణాధికారి తమకిచ్చిన 40 రోజుల గడువులో సుమారుగా 800 మంది వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ లెక్కన రోజుకు దాదాపు 7 ఇళ్లనుంచి వివరాలను సేకరించాల్సి ఉంటుందని, మొదట్లో కొంచెం ఆలస్యమైనా, రానురానూ వేగం పుంజుకుంటుందని చెప్పారు. అడగాల్సిన 40 ప్రశ్నలపై ముందుగా ఎన్యూమరేటర్లు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాలని, కుటుంబంలోని ప్రతీఒక్కరికీ ఆ 40 ప్రశ్నలను అడిగి, వివరాలను సేకరించాలని సూచించారు. జన గణనలో సేకరించిన కులం వివరాలను, ఎట్టిపరిస్థితిలోనూ కుల ధృవీకరణ పత్రం మంజూరులో పరిగణనలోకి తీసుకోవడం జరగదని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జనగణన జాయింట్ డైరెక్టర్, సి.పి.ఓ. బాలాజీ, డిపిఓ డివి మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎఎస్ఓలు, డిటిలు తదితరులు పాల్గొన్నారు.

18న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లాస్థాయి ప్రసంగ పోటీలు

నేటి కాలం – విజయనగరం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువభారత్ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ -- 2027లో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 'మాదకద్రవ్యాల రహిత యువత -- వికసిత్ భారత్' అనే అంశంపై 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువతకు ప్రసంగ పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాస్థాయి పోటీలను ఈ నెల 18వ తేదీన స్థానిక మహారాజా కళాశాలలో నిర్వహించనున్నారు.ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ప్రేమ్ భరత్ కుమార్ మాట్లాడుతూ, ఆసక్తి గల విద్యార్థులు, యువత జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన ముగ్గురికి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. జాతీయస్థాయి పోటీలు 2027 జనవరి 9, 10 తేదీల్లో ఢిల్లీలోని సంవిధాన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అంతేకాకుండా జాతీయస్థాయి ఫైనలిస్టులకు జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీలో జరిగే వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని జిల్లా యువజన అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, జిల్లా యువజన అధికారి ప్రేమ్ భరత్ కుమార్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కొత్త అర్జీల పరిష్కార వ్యవస్థకు కలెక్టర్ ఆదేశం

నేటి కాలం – విజయనగరం: పిజిఆర్ఎస్ లో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను మరింత వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు నూతన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మంగళవారం వివిధ శాఖల అధికారులతో నూతన పీజీఆర్ఎస్ విధానం పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకే సమస్యపై పదేపదే వచ్చే పునరావృత ఫిర్యాదులను సాంకేతిక వ్యవస్థ స్వయంచాలకంగా (ఆటోమేటిక్) గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో తీసుకున్న చర్యలు, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా అటువంటి ఫిర్యాదులకు దానంతట అదే సమాధానం సిద్ధమయ్యే విధానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. దీనివల్ల పరిష్కారంలో జాప్యం తగ్గడంతో పాటు ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.



నూతన విధానంపై అన్ని శాఖల అధికారులు పూర్తి అవగాహన పెంచుకొని, ఫిర్యాదుల పరిష్కారంలో దీనిని తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ, డీఆర్డీఏ, పోలీసు, వ్యవసాయ, ఏపీఈపీడీసీఎల్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో ఆయన విడివిడిగా సమీక్షించారు. ఆయా శాఖలకు అందే అర్జీలలో పాతవి, కొత్తవి వేరుచేసి, పాత ఫిర్యాదు అయితే కంప్యూటర్ వ్యవస్థ ముందే గుర్తించి సమాచారం ఇచ్చేలా తీర్చిదిద్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్డీసీ ఇ. మురళి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Ganagalla Ramarao Printed at Print Point, Kodiganti vari street, Vizianagaram Dist. Pin: 535002, A.P. Published at Ganagalla Ramarao, Konada Village and post, Pusapatirega mandal, Vizianagaram Dist. Pin: 535213, A.P."Editor: Ganagalla Ramarao, Cell: 9581347358 Email: ramaraoganagalla06@gmail.com,